

ఈ ఏడాదికి ఉంటా.. వచ్చే ఏడాది కలుద్దాం!



వస్తా..వెళ్లొస్తా : రాజమహేంద్రవరంలో కుమారి ర్యాంప్ వద్ద విగ్రహాలు

మా బుజ్జి గణేశుడు : చిన్నారుల తలపై గణపయ్యలు

రాజమహేంద్రవరం గోదావరి గట్టుపై కిక్కిరిసిన జనం

మా వాహనమయ్యా..గణేశా : అనపర్తిలో జేసీబీపై తరలింపు

వినాయక..వీడుకోలు!

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గణేశుడి నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి.. ఆదివారం చంద్రగ్రహణం కావడంతో శనివారమే విగ్రహాలను భారీగా తరలించారు. 11 రోజుల పాటు గణపతిని పూజించి ప్రత్యేక పూజలు చేసిన భక్త జనం గణపతి విగ్రహాలను భారీ ఊరేగింపుల నడుమ గోదావరి, కాలువలకు తరలించి గణపతి విగ్రహాల నిమజ్జనాల ప్రక్రియ నిర్వహించారు. రాజమహేంద్రవరంలో కుమారి ర్యాంప్ వద్దకు చేరుకుని నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రైన్ ద్వారా విగ్రహాలను కిందకు దింపి అటుపై పంటులోకి ఎక్కించి వాటిని గోదావరిలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఉదయం 6 గంటల నుంచే విగ్రహాల నిమజ్జనాలు ప్రారంభించారు. అర్ధరాత్రి సమయం వరకు విగ్రహాలు గోదావరి రేవుకు చేరుకుంటూనే ఉన్నాయి.శనివారం ఒక్కరోజే సుమారు 750 గణపతి విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. ఇంకా నిమజ్జన ప్రక్రియ కొనసాగుతుంది. శనివారం రాత్రి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రేవు వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.



వెళ్లిరావయ్యా : రాజమహేంద్రవరంలో కుమారి ర్యాంప్ వద్ద గణేశుడి విగ్రహాన్ని గోదావరిలో తోస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, తదితరులు



కాకినాడ-రాజమహేంద్రవరం గోదావరి కాలువ

గోదారయ్..రయ్!

ఉమ్మడి జిల్లాలో గోదావరి కాలువలపై సరుకు రవాణా

ఒకనాడు రోడ్డు మార్గాలు.. ఆకాశ మార్గాలు ఉండేవి కావు.. కేవలం జల రవాణా లేదంటే నడక.. అందుకే నేటికీ చెబుతుంటారు.. మా తాతలు కాలవల ద్వారా ప్రయాణించే వారని.. అదంతా బ్రిటిష్ వారి కాలంలో మాట.. నేటికీ ఆయా గురుతులు నిడదవోలు, వేమగిరి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి.. మళ్లీ ఆ రోజులు రాబోతున్నాయి.. జల రవాణాను మళ్లీ అందుబాటులోకి తేనున్నారు..ఈ మేరకు గోదావరిలో పది మార్గాలను గుర్తించారు.. ఆయా మార్గాల అభివృద్ధికి టెండర్లు పిలిచారు.. అన్నీ అనుకున్నట్టే జరిగితే గోదారిలో రయ్ రయ్ మంటూ వెళ్లిపోవచ్చు.

- పది రూట్లలో సరుకు సరఫరా
- వాటర్‌వేస్ అథారిటీ ప్రతిపాదన
- రవాణాకు సానుకూలత
- పర్యాటక బోట్లకు సౌకర్యం
- కాలువల అభివృద్ధికి టెండర్లు
- పీపీపీ విధానంలో పనులు
- మారనున్న గోదారి

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గోదావరి అంటే అందాలు.. సరదా షికార్లు.. కానీ ఒకప్పుడు రవాణా రంగం అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో గోదావరిపై అనేక ప్రాంతాలకు బోట్లలో సరుకు రవాణా చేసేవారు. పరిశ్రమలకు అవసరమయ్యే ముడిసరుకులను తరలించేవారు.అనేక పోర్టులకు విదేశాల నుంచి వచ్చే కార్గోను సైతం గోదావరి మీదుగా రవాణా చేసేవారు. బోట్లలో ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరేవారు.అయితే మళ్లీ ఇప్పుడు మునుపటి తరహాలో కారు చౌక అయిన జల రవాణా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.గతంలోలా గోదావరి నదిపై బోట్లలో రవాణా జరిగేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం నుంచి విజయవాడ, రాజ మహేంద్రవరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నర్సాపురం,నర్సాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూరు వరకూ ప్రయాణించేలా మొత్తం పది మార్గా లను ఎంపిక చేసింది.ఈ రూట్లలో కాలువల అభివృద్ధి,కార్గో తరలింపు, పర్యాటకుల రవాణా పీపీపీ విధానంలో అభివృద్ధి చేయబోతోంది.

ఎలా ఉపయోగిస్తారంటే..

కాకినాడ పోర్టుకు తెలంగాణ, తమిళనాడు నుంచి వేలాది లారీల్లో భారీ ఎత్తున బియ్యం విదేశాలకు ఎగుమతి కోసం వస్తోంది. భవిష్యత్తులో గోదావరిపై బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించేందుకు అడుగులు పడుతున్నా యి. తెలంగాణ నుంచి పోర్టుకు చైనాకు ఎగుమతి చేయడం కోసం భారీ బండరాళ్లను విజయవాడ -విశాఖ హైవే ద్వారా తరలిస్తు న్నారు. భవిష్యత్తులో ఈ రాళ్లను గోదావరి ద్వారా రవాణా చేయడానికి అనువుగా ఉంటుందని, ఖర్చు కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. వివిధ దేశాల నుంచి కాకినాడ పోర్టుకు బొగ్గు, ఎరువులు దిగుమతవుతున్నాయి. వీటిని తెలంగాణతో పాటు విజయవాడ సమీపంలోని అనేక థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు గోదావరిపై బొగ్గు రవాణా చేయనున్నారు. భద్రాచలం, రాజమ హేంద్రవరంలో కాగితం పరిశ్రమలకు పల్ప్‌ను రవాణా చేయడానికి డిమాండ్ ఉందని గుర్తించారు. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు కాలువ ద్వారా విజయవాడకు అనేక రకాల సరుకుల కారుచౌక ధరకు రవాణా చేసేందుకు అవకాశాలు చాలా ఉన్నట్టు గుర్తించారు. కాకినాడ పోర్టుకు క్లింకర్, రాక్‌పాస్ఫేట్ వంటి అనేక రకాల కార్గో వివిధ పరిశ్రమలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. వీటన్నింటినీ గోదావరిపై కార్గో రవాణా ద్వారా భారీ ఎత్తున చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వరకు కేవలం పర్యాటకుల కోసం ప్రస్తుతం బోట్లు నడుపుతున్నారు.ఈ రూట్‌లో భవిష్యత్తులో తెలంగాణకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకులను పెద్దఎత్తున తరలించేలా జలరవాణాను ప్రోత్సహించనున్నారు. నర్సాపురం-అంతర్వేది, ముక్తేశ్వరం -కోటిపల్లి రూట్లలో ప్రస్తుతం పంట్లలో రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో ఈ రూట్లను ఆధునికీకరించి పెద్ద ఎత్తున వస్తు రవాణా,పర్యాటకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేలా జల రవాణా ప్రోత్సహించనున్నారు. దీంతో మళ్లీ పూర్వపు రోజులు రానున్నాయి.

గోదారి వయా..

కాకినాడ నుంచి రాజమహేంద్రవరం కాలువ, రాజ మహేంద్రవరం నుంచి విజయవాడకు ఏలూరు కెనాల్, రాజమ హేంద్రవరం నుంచి గండి పోచమ్మ, గండిపోచమ్మ నుంచి భద్రాచలం, పురుషోత్తపట్నం నుంచి భద్రాచలం, పురు షోత్తపట్నం నుంచి పోలవరం, పట్టిసీమ హిల్‌లాక్ టెంపుల్ నుంచి పట్టిసీమ మెయిన్ లాండ్, అంతర్వేది పల్లిపాలెం నుంచి నర్సాపూర్ వెస్ట్, నర్సాపురం నుంచి సఖి నేటిపల్లి, రాజోలు మండలం సోంపల్లి నుంచి అబ్బిరాజుపాలెం, కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం వరకు మొత్తం పది రూట్ల లో గోదావరిలో కార్గో రవాణాకు వీలుగా రహదారులను అభివృద్ధి చేయబోతున్నారు. ఈ మేరకు వాటర్‌వేస్ అథారిటీ ఇటీవల టెండర్లు పిలిచింది. ఈ పది రూట్లను స్ట్రాటజిక్ మార్గాలుగా అభివృద్ధి చేసి పరిశ్రమల క్లస్టర్లు, మల్టీమోడల్ కనెక్టివిటీ పాయింట్స్‌ను గుర్తించాలని పలు కంపెనీలను ఆహ్వానించింది. గోదావరిపై గుర్తిం చిన పది రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఒకప్పుడు కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు ఉన్న కాలువ ద్వారా ఏటా 11 మిలియన్ టన్నుల కార్గో రవాణాకు అవకాశం ఉందని కొంతకాలం కిందట వాప్కోస్ అనే సంస్థ అధ్యయనంలో తేల్చింది. ఇందులో 30శాతం కార్గో రవాణా కాకినాడ- రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం- భద్రాచలం, రాజమహేంద్రవరం-విజయవాడ జలమార్గాల్లో జరిగే అవకాశం ఉందని విశ్లేషించింది.

ఎన్నిదారులో..

గోదావరిని పర్యాటకంగా,పారిశ్రామికంగా ఉపయోగించేందుకు అడుగులు పడుతున్నాయి. పరిశ్రమలకు ముడిసరుకుల రవాణా నుంచి ఆయా పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తుల రవాణా వరకు గోదావరి నది ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకు నేషనల్ వాటర్ వే-4ను అభివృద్ధి చేసి పూర్వ వైభవం తెచ్చేలా సన్నాహాలు చేస్తోంది. కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు ఉన్న ఈ జల రహదారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలను కలుపుతూ 1,095 కిలోమీటర్లు పయనిస్తోంది. ఈ జల రహదారిలో అత్యంత కీలకమైన కాకినాడ, రాజమహేంద్రవరం,విజయవాడ, భద్రాచలం రూట్లను కొత్తగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ తాజాగా నిర్ణయించింది. ప్రధానంగా గోదావరి నది ద్వారా కాకినాడ, రాజమహేంద్రవరం, విజ యవాడ, భద్రాచలం,అంతర్వేది రూట్లలో కార్గో, పర్యాటక రవాణాకు ఎంతో డిమాండ్ ఉందని భావిస్తోంది.ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరిపై మొత్తం పది రూట్లను ఎంపిక చేసింది. ఈ మార్గాల్లో కాలువలను అభివృద్ధి చేసి సరుకు రవాణా, పర్యాటక రవాణా అభివృద్ధి చేయాలని ప్రతి పాదించింది.ఈ రూట్లలో ఒకప్పుడు సరుకు రవాణా ఎక్కువగా జరిగేది. కాకినాడ నుంచి బకింగ్‌హం కాలువ వరకు ఎన్నో ఏళ్ల కిందట అనేక పరిశ్రమలకు ఈ కాలువ ద్వారా కార్గో రవాణా అయ్యేది.ఈ నేపథ్యంలో మళ్లీ గోదావరిపై రవాణాకు ద్వారాలు తెరవబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.



పిఠాపురం మునిసిపాలిటీ, తాళ్లపూడిలో నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

వలంటీర్లలా చేయలేం!

సచివాలయ ఉద్యోగుల ఆందోళన బాట

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన
- రిజిస్ట్రేషన్ విధులు బహిష్కరణ

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. మునిసిపల్, నగరపంచాయతీ, మండలపరిషత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను సామూహికంగా బహిష్కరించారు.ఆత్మగౌరవం కోసమే తాము ఆందోళన బాట పట్టామని వారు స్పష్టం చేశారు. ఒక క్లస్టర్‌లో వలంటీర్ విధులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం నుంచి ఆందోళన చేపట్టారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై విధులు నిర్వహించారని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు అప్పగిస్తూ మ్యాప్ చేయడంతో పాటు బలవంతంగా ఇంటింటికి తిరిగి విధులు నిర్వర్తించే బాధ్యతలు అప్పగిస్తున్నారని తెలిపారు. ఇదే రీతిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటా తిరిగి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఇంటికి సర్వీస్ నమోదు చేయించాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అధికారులు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు గూగుల్‌మీట్ ద్వారా సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను బహిష్కరించాలని, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా పిఠాపురం మునిసిపల్ కార్యాలయంతో పాటు కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, తుని పురపాలక సంఘాలు, గొల్లప్రోలు, ఏలేశ్వర నగరపంచాయతీలు, కాకినాడ కార్పొరేషన్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి వార్డు సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎక్కడికక్కడ ఆందోళనలు నిర్వహించారు. గ్రామ, సచివాలయ ఉద్యోగుల మనోవేదన ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే నిరసన తెలియజేస్తున్నామని సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు.

జిల్లాకు రెండు కొత్త పోలీస్ జాగిలాలు | 15 నుంచి యూటీఎఫ్ రణభేరి 7
జేసీ చిన్నరాముడుకు సన్మానం



క్రేన్‌లు, మోటార్ల మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

బ్యారేజ్‌పై 78 గేట్లకు అత్యవసర మరమ్మతులు

మద్దూరు, విజ్జేశ్వరం ఆరమ్‌లలో పనులు ప్రారంభించిన ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నీటి పారుదల పథకాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం సీతంపేట వద్ద ధవళేశ్వరం బ్యారేజ్‌పై మద్దూరు, విజ్జేశ్వరం ఆరమ్‌లలోని 78 గేట్లకు సంబంధించి క్రేన్లు, మోటార్ల అత్యవసర మరమ్మతు పనులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. 1976లో ప్రారంభించిన మద్దూరు, విజ్జేశ్వరం ఆరమ్‌లలో క్రేన్‌లు, మోటార్లు మరమ్మతులకు గురికావడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.దీనిపై స్పందించిన జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తక్షణం రూ.18 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు పనులు ప్రారంభించినట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు నియోజకవర్గంలోని మలకపల్లి వచ్చినప్పుడు ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు గురయ్యాయని సుమారు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, బేతిన నారాయణ, కంటిపూడి శ్రీనివాస్, మురపట్ల కళాధర్, సుంకర సత్తిబాబు, సర్పంచ్‌లు జెట్టి బంగారయ్య, మేరకల శ్రీను, డీఈ ఆనంద బాబు, ఆర్‌పీవో సెక్షన్ ఏఈ ఆర్.సునీల్‌బాబు, అక్కిన రాంబాబు పాల్గొన్నారు.

యూరియా కొరత అవాస్తవం

- అందుబాటులో 1667 మెట్రిక్ టన్నులు : కలెక్టర్
- ఇప్పటి వరకూ 21 వేల మెట్రిక్ టన్నులు సరఫరా
- నానో యూరియా లాభదాయకం : జేడీఏ

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం ఆందోళన చెందనవసరం లేదని.. ప్రస్తుతం జిల్లాలో 1667 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ ప్రశాంతి శనివారం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎరువులకు అంతరాయం లేకుండా సరఫరా కొనసాగుతుందన్నారు. గతేడాది 2024 సెప్టెంబరు చివరి నాటికి 19 వేల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరగ్గా ఈ ఏడాది 2025 సెప్టెంబరు 5వ తేదీ నాటికి 21 వేల మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ అక్టోబరు చివరి వరకు జిల్లా అవసరం దాదాపు 26,473 మెట్రిక్ టన్నులు ఉంటుందన్నారు. అంటే ఇంకా 5,525 మెట్రిక్ టన్నులు వినియోగానికి అవసరమని..స్టాక్ అందుబాటులో ఉంచుతున్నట్టు పేర్కొన్నారు. యూరియా కొరత ఉందని కొంతమంది చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువుల సరఫరాకు జిల్లా యంత్రాగం పూర్తిగా సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలోని 94 సొసైటీల్లో 2025 సెప్టెంబరు వరకు 13,689 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయన్నారు. గత ఖరీఫ్ సీజన్ కంటే 2,602 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా అమ్మకాలు జరిగాయన్నారు.

అవసరానికి మించి యూరియా వాడొద్దు

అవసరానికి మించి యూరియా వాడకం వల్ల నేల దాని సహజ స్వభావం కోల్పోతుందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. రూరల్ మండలం తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నానో ఎరువుల వినియోగంపై ప్రచారం నిర్వహించారు. నానో యూరియా 500 ఎంఎల్ బాటిల్ 45 కేజీల యూరియా బస్తాను భర్తీ చేస్తుందన్నారు. సంప్రదాయ ఎరువుల 2-3 దఫాలు వేయడం వల్ల అనేక రకాలు అనగా నీరు, గాలిలో కలిసి కొంత వరకు మాత్రమే పంటకు లభ్యమవుతుందన్నారు. నానో యూరియా వాడకం సులభం మరియూ పంటపై స్ప్రే చేయడం వల్ల పైరు త్వరగా గ్రహించి పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు డీఎస్ రెడ్డి, భీమరాజు, పీటర్, సొసైటీ సీఈవో సత్యనారాయణ, సంఘం చైర్మన్ దండమూడి బాపినీడు, సభ్యులు నల్లూరి రామకృష్ణ, విన్నకోట శేషాచార్యులు రైతులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

ప్రైవేటు అంబులెన్స్‌ల దందాపై విచారణ

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో ప్రైవేటు అంబులెన్స్‌లు, ఆటోల దోపిడీ దందాపై విచారణ మొదలైంది. ఈ నెల 4న 'శవాలతో బేరం' శీర్షికన పేదలను పిండేస్తున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలి సిందే.దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రశాంతి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్, ప్రభు త్వాస్పత్రి ప్రత్యేక అధికారి భాస్కర్‌రెడ్డిని ఆదేశించారు.5న సెలవు కావడంతో శనివారం(6న) భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని సూపరింటెండెంట్ సౌభాగ్యలక్ష్మి సమక్షంలో ప్రైవేటు అంబులెన్స్‌ల డ్రైవర్లను విచారించారు. తాము పేదలకు సేవ చేస్తున్నామని..50 కిలోమీటర్లకు కేవలం రూ.800 మాత్రమే తీసుకుంటున్నామంటూ వారు డిప్యూటీ కలెక్టర్‌కి అవాస్తవాలు చెప్పినట్టు సమాచారం. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కి ఫోన్ చేస్తా నంటూ ఓ వ్యక్తి డిప్యూటీ కలెక్టర్‌ని సైతం బెదిరించినట్టు తెలుస్తోంది.నివేదికను కలెక్టర్‌కి సమర్పించిన అనంతరం చర్యలు తీసుకోనున్నారు.ఈ విషయంలో అంబులెన్స్‌లు,ఆటోలను వెనకేసుకొచ్చి అధికారులపై 'పెద్దలు' ఒత్తిడికి దిగకపోతే పేదలకు న్యాయం జరిగే అవకాశం ఉందని వాదన వినవస్తోంది.

9న మెరిట్ స్టాఫ్‌నర్సుల సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ వైద్య, ఆరోగ్యసంచాలకుల కార్యాలయంలో జోన్-2 పరిధిలో స్టాఫ్‌నర్సు పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఈ నెల 9వ తేదీన జరుగుతుందని సంచాలకులు పి.పద్మా శశిధర్ పేర్కొన్నారు.ఈ ఏడాది జనవరి 2 నుంచి 17వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించామన్నారు. పరిశీలన అనంతరం తుది మెరిట్ లిస్టులను జూలై 7న విడుదల చేశామన్నారు. మెరిట్ జాబితాలోని అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి అదే రోజున కౌన్సెలింగ్ జరిపి ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన జరుగుతుందన్నారు.

వెళ్లిరావయ్యా..ఉండ్రాలయ్యా!


యువోత్సాహం : కరపలో గణేశుడి ఊరేగింపులో యువత సందడి


మేము సైతం : అనపర్తిలో సందడిగా విజయగణపతి స్వామి శోభాయాత్ర


వెళ్లొస్తా : కోటిపల్లి వద్ద గోదావరిలో గణేష్ నిమజ్జనం


వెళ్లిరావయ్యా : ఉప్పాడ తీరంలో నిమజ్జనం


నేనూ.. నీ వెంటే : కరపలో శివలింగం తరలింపు

జై..జై గణేశా.. జైకొడతాం గణేశా అంటూ ఊరంతా ఊగిపోయారు..గణేశుడి విగ్రహాలను సందడిగా తరలించారు.. చిన్నా పెద్దా అందరూ డ్యాన్స్‌లతో అలరించారు.. మా దేవుడంటూ ఊరంతా నిమజ్జనోత్సవాల్లో భాగమయ్యారు.. ఆదివారం చంద్ర గ్రహణం కావడంతో శనివారం 11వ రోజునే దాదాపుగా గణేశ్ విగ్రహాలన్నీ నిమజ్జనోత్సవాలకు తరలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటు చూసినా ఊరేగింపులతో దద్దరిల్లిపోయింది.. సందడి మారింది.. బై బై గణేశా.. వెళ్లిరావయ్యా గణేశా అంటూ ఉత్సాహంగా వీడ్కోలు పలికారు..


గణనాథుల రథం పరిశీలిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల


నెత్తిన పెట్టుకుంటామయ్యా : శంఖవరం మండలం కత్తిపూడిలో మహిళలు ఇలా..


వచ్చేశాం : కాకినాడ సాగరతీరానికి గణనాథులతో తరలివచ్చిన ట్రాక్టర్ల క్యూ


ఆనంద సాగరం : కాకినాడ తీరంలో గణేశ్ నిమజ్జనోత్సవాలు.. తరలివచ్చిన భక్తజనం


బుజ్జి గణపయ్యలు : గన్నవరం మండలం చాకలిపాలెంలో 31 విగ్రహాలతో కదిలిన గణనాథుల రథం


బై బై గణేశా : కాకినాడ రూరల్ సర్పవరంలో నిమజ్జనానికి గణేశుడి తరలింపు


అంబాజీపేటలో..


రాజమండ్రిలో..


కోరుకొండలో..


యానాంలో..


కాకినాడలో భారీ గణనాథుడిని తరలిస్తున్న చిన్నారులు

లడ్డూలు.. రూ.లక్షలు!


బిక్కవోలులో లడ్డూను రూ.1.25 లక్షలకు దక్కించుకున్న దోసారావు

చవితి ఉత్సవాల సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు లక్ష్మీగణపతి స్వామికి సురుచి ఫుడ్స్ 50 కిలోలు, మరో ఇద్దరు భక్తులు 60 కిలోలు, 20 కిలోల చొప్పున లడ్డూలను కానుకలుగా అందజేశారు. వీటికి వేలం నిర్వహించారు. 50 కిలోల లడ్డూను రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన నిమ్మకాయల శివ శంకరదోసారావు రూ.1.25 లక్షలకు దక్కించుకున్నారు. 60 కిలోల లడ్డూను విజయవాడ వద్ద వున్న గొల్లపూడికి చెందిన బి.నారాయణ్‌సింగ్-మానస దంపతులు రూ.66,666కు, 20 కిలోల లడ్డూను గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నేతేటి అరుణ కుమారి రూ.22,222కు దక్కించుకున్నారు. వీటిని ఉత్సవ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి అందజేశారు.

-బిక్కవోలు (ఆంధ్రజ్యోతి)

యానాంలో...


లడ్డూను కైవసం చేసుకున్న భక్తుడు

యానాం కనకాలపేట రామాలయం సెంటర్లో కొలువైన మహాగణపతి 108 కిలోల లడ్డూతో పాటు మరో 10చిన్న లడ్డులను వేలం పాటలో అదే గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ కనకాల సత్యనారాయణ రూ.లక్ష 15 వేల ఒక్క రూపాయికి దక్కించుకున్నారు.

-యానాం (ఆంధ్రజ్యోతి)

వెంకన్న ఆలయం... భక్త జనసంద్రం!

వాడపల్లిలో ప్రత్యేక పూజలు

రూ.65 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. నిండు మనసుతో మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి భారీ క్యూలైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామునే సుప్రభాతసేవ, నీరాజనమంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.65 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ప్రత్యేక అలంకణలో స్వామివారు, ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అమెరికామెడీ నాటికలు ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ),సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అమెరికామెడీ నాటిక ప్రదర్శనలు శనివారం రాత్రి దంటు కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా చిరంజీవిని కుమారి కళాప్రాంగణాన్ని విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ప్రారంభించారు. ముఖ్య అతిథి ఉప్పులూరి సుబ్బరాయశర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. యంగ్మెన్స్ క్లబ్ అధ్యక్షుడు దంటూ భాస్కర్ సభకు అధ్యక్షత వహించారు. వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాల కిందట తాను రాసిన 30 హాస్య నాటికల నుంచి 5 నాటికలను ఎంపికచేసి 2రోజుల పాటు దంటు కళాక్షేత్రంలో ప్రదర్శించడం సంతోషకరమైన విషయమన్నారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ చిట్టెన్ రాజు అమెరికాలో ఉంటూ మన సంస్కృతి,సంప్రదాయాలను మర్చిపోకుండా అనేక సాహితీ సదస్సులను నిర్వహిస్తూ తెలుగుభాషా సాహిత్యాలకు ఇతోధిక సేవ చేయటం అభినందనీయమన్నారు. భరణి చేతులమీదుగా వేదికపై 5 పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. నాటక రంగానికి విశేష కృషి చేసిన ఆచార్య బీవీ.రమణమూర్తి (మార్గశీర్ష), ఆచార్య డీఎస్ఎన్. మూర్తిలను యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు దంటు భాస్కర్ సంస్థ తరపున సత్కరించారు. అనంతరం మహతి క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే యమసభ, శ్రీజయ ఆర్ట్స్ హైదరాబాదు వారిచే మగపాత్ర లేని నాటిక ప్రదర్శించారు. కె.కృష్ణారావు, మార్ని జానకిరామ్ చౌదరి, సుచిత్రామూర్తి, పి.ప్రభుదాస్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న సినీ నటుడు తనికెళ్ల భరణి

‘ఆదిత్య’లో విస్మయ గ్రాండ్ ఫినాలే

కాకినాడ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల డేటాసైన్స్ విభాగం ఆధ్వర్యంలో విస్మయ-2025 గ్రాండ్ ఫినాలే రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. శనివారం జరిగిన ముగింపు సదస్సుకు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అధ్యక్షత వహించగా జేఎన్టీయూకేలోని యూసీఈకే సీఎస్ఈ ప్రొఫెసర్ ఎల్.సుమలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శేషారెడ్డి మాట్లాడుతూ దేనిలోనైనా ముందు మేల్కొన్న వారినే విజయం వరిస్తుందని విద్యార్థులకు సూచించారు. సుమలత మాట్లాడుతూ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రస్తుతం మార్కెట్లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు డైటా సైన్స్ స్టార్టప్‌లను రూపొందించాలని పిలుపునిచ్చారు. డేటా సైన్స్ డీన్ వరుణ్‌రావు పరిశ్రమల్లో మారుతున్న సాంకేతికత, సాఫ్ట్‌వేర్ అంశాలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కళాశాలల నుంచి 180 మంది డైటా సైన్స్ విద్యార్థులు హాజరు కాగా ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ, మూర్తి, కార్తీక్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు ప్రతిభా పత్రాలను అందజేస్తున్న శేషారెడ్డి, సుమలత

రాజేంద్రచోలుడు స్మారకార్థం
రూ.వెయ్యి నాణెం విడుదల



విడుదలైన రూ.వెయ్యి నాణెం



అమలాపురం టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే కాకుండా సముద్రాల మీదుగా నావికా దండయాత్రలు చేపట్టి వాణిజ్యం సంస్కృతిని విస్తరింపచేసిన చోళ సామ్రాజ్యాధినేత రాజేంద్రచోలుడు జ్ఞాపకార్థం ముంబై టంకశాల రూ.వెయ్యి నాణేన్ని విడుదల చేసింది. వలస రాజ్యాలను ఏర్పాటు చేయడంతో పాటు వాణిజ్య మార్గాలను విస్తరించేందుకు తొలిసారిగా రాజేంద్రచోలుడు వెయ్యేళ్ల క్రితమే నావికా దండయాత్రను చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయనకు ‘గంగయ్యకొండచోళ’ బిరుదు ప్రదానం చేశారు. చోళసామ్రాజ్యాన్ని విస్తరించిన రాజేంద్రచోలుడిని స్మరించుకుంటూ వెయ్యవ వార్షికోత్సవాన్ని గంగయ్యకొండ చోళపురంలో జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ముంబై టంకశాల 40 గ్రాముల పూర్తి వెండితో 44 మిల్లీమీటర్ల వ్యాసంతో రూ.వెయ్యి నాణేన్ని విడుదల చేసింది. నాణెం ముందు భాగాన భారతదేశ రాజముద్ర, వెనుకవైపు రాజేంద్రచోలుని ముఖ చిత్రంతో పాటు తంజావూరులోని బృహదీశ్వరాలయం, చోలుడు ప్రయాణించిన కౌలను ముద్రించారు. ఈ నాణేన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ముంబై టంకశాల నుంచి సేకరించారు.

‘నన్నయ’ అనుబంధ కళాశాలలు రెండింటికి
ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు కళాశాలలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించాయని రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బీవీ రాజు కళాశాల అధికారులు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సర్టిఫికెట్‌ను రిజిస్ట్రార్ నుంచి అందుకున్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐదు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలకే ఈ గుర్తింపు లభించిందన్నారు. అందులో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, భీమవరం బీవీ రాజు కళాశాల నన్నయ విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలలుగా ఉన్నాయన్నారు. రెండు కళాశాలల యాజమాన్య ప్రతినిధులకు రిజిస్ట్రార్‌తో పాటు ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీవీ రాజు కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


రిజిస్ట్రార్ స్వామి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న బీవీ రాజు కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్



సీతాఫలం..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బ్రిడ్జి లంకలో సీతాఫల వృక్షంపై సీతాకోకచిలుకలు వాలి ఉడతలు కొట్టిన సీతాఫలాలను ఆరగిస్తుండగా ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పి.మల్లవరంలో 'కింగ్ ఫిషర్'

● అరుదైన పక్షి ప్రత్యక్షం

తాళ్లరేవు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో ఓ అరుదైన పక్షి ప్రత్యక్షమైంది. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఎగురలేని స్థితిలో పడివున్న కింగ్‌ఫిషర్ పిట్టను అటవీ శాఖ అధికారులకు ధూళిపూడి వెంకటరమణ శనివారం అప్పగించారు. అటవీ శాఖ అధికారి వరప్రసాదరావు ఆదేశాల మేరకు ఫారెస్ట్ ఆఫీసర్లు గోపి, విష్ణు పిట్టను తీసుకువెళ్లి చొల్లంగి మడ అడవుల్లో విడిచిపెట్టారు.



అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకున్న కింగ్‌ఫిషర్ పిట్ట

25 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితుడితో పోలీసులు

చింతూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు పోలీసులు శనివారం చింతూరులోని బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో 25 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్టు చింతూరు ఎస్‌ఐ పి.రమేష్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బూడుగూడకు చెందిన షేక్ రాంబాబు వయా చింతూరు మీదుగా గంజాయిని భద్రాచలం వైపు తరలిస్తుండగా పట్టుకున్నారు.

సౌమ్యతకు మారుపేరు ..చిన్నరాముడు

● తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

● జిల్లా ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చింది: జేసీ చిన్న రాముడు

● ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా యంత్రాంగం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా ... సౌమ్యత, మృదుస్వభావం కలిగి ఉండడం జేసీ చిన్న రాముడు ప్రత్యేకత అని రాజమహేంద్రవరం కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.బదిలీపై వెళుతున్న ఆయన్ని శనివారం సాయంత్రం ఆత్మీయ వీడ్కోలు సభను కలెక్టరేట్‌లో నిర్వహిస్తూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జేసీ మేఘస్వరూప్‌కి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త విషయాలను నేర్చుకోవడంలో ఆయన ఎప్పుడూ ఆసక్తి చూపేవారని, ఇది ఆయనకు పని పట్ల ఉన్న నిబద్ధత అని అన్నారు. యోగాంధ్ర, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, తదితర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం వెనుక చిన్న రాముడు కృషి ఎంతో ఉందన్నారు. విధి నిర్వహణలో ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండేవారన్నారు. చిన్న రాముడు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చిన్న రాముడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం జిల్లా ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిందన్నారు. నూతన జేసీ మేఘస్వరూప్ మాట్లాడుతూ చిన్నరాముడు మంచి మనసున్న వ్యక్తిగా తన ప్రత్యేకతను సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణీసుస్మిత, డీపీవో మాధవరావు, డిప్యూటీ కలెక్టర్ భాస్కరరావు, డీఎస్‌వో పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



జేసీ చిన్నరాముడుకు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మోతుగూడెంలో బాహుబలి లారీ




రోటర్ వాల్ బోల్‌ను తీసుకొస్తున్న లారీ

మోతుగూడెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నుంచి అల్లూరి జిల్లా మోతుగూడెంలోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి శనివారం 68 టైర్ల లారీ వచ్చింది. దీన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఇక్కడ నిర్మిస్తున్న 5,6 యూనిట్లకు సంబంధించి రోటర్ వాల్‌బోల్‌ను దీనిపై తీసుకొచ్చారు. 48 టన్నుల వరకు ఉంటుంది.

'డొంకరాయి' నుంచి నీటి విడుదల

● 3000 క్యూసెక్కుల నుంచి 1000 క్యూసెక్కులకు తగ్గించిన జెన్‌కో అధికారులు



జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామ జిల్లా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి శనివారం ఉదయం మూడు వేల క్యూసెక్కుల నీటి నుంచి వెయ్యి క్యూసెక్కులకు తగ్గించినట్టు ఏపీ జెన్‌కో అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి జలాశయంలో నీటిమట్టం 1035.10 అడుగులకు చేరుకోవడంతో నీటిని విడుదల చేశారు. అలాగే డొంకరాయి కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం నాలుగువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని సీలేరు కాంప్లెక్స్ జెన్‌కో అధికారులు తెలిపారు.

ఎంపీడీవోలకు పదోన్నతులు

● రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ

సామర్లకోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంపీడీవోలుగా పనిచేస్తున్నవారు ఏపీడీ, డీఎ ల్డీవోలుగా పదోన్నతులు పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు 'ఆంధ్రజ్యోతి'కి అందిన సమాచారం మేరకు పదోన్నతులు పొందిన అధికారుల వివరాలిలా ఉన్నాయి. పెద్దాపురం ఎంపీడీవోగా పనిచేస్తున్న డీవీ. శ్రీలలిత విశాఖ జిల్లా డ్వామా కార్యాలయంలో డీవీవోగా పదోన్నతి పొందారు. కరప ఎంపీడీవోగా పనిచేస్తున్న మట్టపర్తి అనుపమ పశ్చిమగోదావరి జిల్లా డ్వామా కార్యాలయ డీవీవోగా పదోన్నతి పొందారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో వ్యవసాయాధికారి ఫ్యాకల్టీగా పనిచేస్తున్న సుంకరణం సుబ్రహ్మణ్యశర్మ పదోన్నతిపై సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలోనే వ్యవసాయాధికారిగా పదోన్నతి పొందారు. అలాగే అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎలుబూడి మహేశ్వరరావు అదే జిల్లాలో పి.గన్నవరం డ్వామా కార్యాలయంలో ఏపీడీగా పదోన్నతి పొందారు. మారేడుమిల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏపీడీగా పదోన్నతి పొందారు. ఈ మేరకు జీవో ఆర్‌టీ 724 పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదోన్నతులు పొందిన ఈ అధికారులు 15 రోజుల్లోగా వారికి కేటాయించిన స్థానాల్లో విధులు చేపట్టాల్సి ఉంది.

జిల్లాకు రెండు కొత్త పోలీస్ జాగిలాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాకు రెండు పోలీసు జాగిలాలు చేరుకున్నాయి. వాటి శిక్షణను ఎస్పీ నరసింహ కిషోర్ పరిశీలించి, డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ జాగిలాల పేర్లు కైరా, రాడో అని ఆయన చెప్పారు. రాడో నేరస్తులను పట్టుకోవడం, నార్కొటిక్ పదార్థాలు గుర్తించడంలో ప్రతిభ కనబరుస్తుందన్నారు. ఇది శిక్షణ కాలంలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించిందన్నారు. కైరా పేలుడు పదార్థాలు గుర్తించడంలో ప్రతిభ సాధించిందన్నారు. వీటి రాకతో దర్యాప్తులు మరింత శక్తివంతమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి అందిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

జువైనల్ జస్టిస్ బోర్డుతో పీడీజే సమావేశం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత శనివారం సమావేశమయ్యారు. బాలనేరస్థుల కేసుల విషయంలో మెరుగైనసేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, మూడో అదనపు మేజిస్ట్రేట్ పీవీ రాఘవేంద్రరావు, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒడిశా వాసి మృతి

తునిరూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు మృతిచెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నర్సీపట్నం- గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య మృతదేహం పడి ఉండడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు వివరాలపై ఆరా తీశారు. కాగా, ఆయన వద్ద ఉన్న రైల్వే టికెట్, పాన్ కార్డు ఆధారంగా మృతుడు ఆచూకీని వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గోలాఘాట్ జిల్లాకు చెందిన రోమన్ గగోయ్ (35)గా గుర్తించారు. మృతిచెందిన వ్యక్తి అస్సాం రాష్ట్రం నుంచి కేరళకు ట్రైన్‌లో ప్రయాణిస్తున్నాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రంగా విగ్రహం ఏర్పాటు..తొలగింపు

» కాకినాడలో ఉద్రిక్తత

» అనుమతుల్లేకుండా ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాల ఏర్పాటుకు వీల్లేదు: కమిషనర్



నాయకులతో చర్చిస్తున్న కమిషనర్ భావన

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలోని శారదా దేవి గుడి, ముత్తా గోపాలకృష్ణ కూడలిలో రంగా విగ్రహం ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జంక్షన్ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇంతలో ఆ జంక్షన్లో విగ్రహాల రగడ మొదలైంది. కొంతకాలంగా ఆ జంక్షన్లో ఎవరికివారుగా తమ నాయకుడి విగ్రహం పెట్టాలంటే, కాదు తమ నాయకుడి విగ్రహం పెట్టాలని పోటీపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో పరిస్థితిని అర్థం చేసుకున్న కమిషనర్ భావన... కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు రాత్రికి రాత్రే జంక్షన్‌లో ఏర్పాటుచేసిన దిమ్మను తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో సమస్య సద్దుమణిగిందనుకున్నారు. ఇంతలో తిరిగి రోటరీ క్లబ్ పనులు ప్రారంభించగా శనివారం తెల్లవారుజామున కొంతమంది వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ భావన సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసుల సహకారంతో విగ్రహాన్ని తొలగించారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహించిన ఆందోళనకారులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. విగ్రహాన్ని తిరిగి అక్కడే పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. ఆందోళనకారులు బ్రిడ్జి పైన ఆందోళన, ధర్నా చేపట్టడంతో విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వాహనదారులు చాలా ఇబ్బందులకు గురై ఆందోళనకారులపై అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ భావన ఆందోళనకారులతో చర్చించి అనుమతులు లేకుండా పబ్లిక్ ప్లేస్‌లో నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయడానికి వీలులేదన్నారు. చర్చలు విరమింపజేశారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ కేవీ కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు నుంచి పడి వార్డు సభ్యుడి మృతి



కముజు సూరిబాబు (ఫైల్ ఫొటో)

ముమ్మిడివరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామ పంచాయతీ రెండో వార్డు సభ్యుడు కముజు వీరవెంకట సత్యనారాయణ(సూరిబాబు) (48) కొబ్బరిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. సూరిబాబు శనివారం ఉదయం బొండం తీసేందుకు కొబ్బరిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తూ జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా సూరిబాబుకు భార్య, కుమార్తె, తల్లిదండ్రులు ఉన్నారు. మృతదేహాన్ని ముమ్మిడివరం పోలీసులు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందజేశారు. మృతుడి భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే సూరిబాబు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆరేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి

పెద్దాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో శనివారం ఆరేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసింది. స్థానికుల వివరాల ప్రకారం.... పట్టణంలోని తాడితోట ప్రాంతానికి చెందిన పాసిల లక్ష్మీదుర్గ ఇంటి బయట ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేయడంతో చిన్నారి తలపై తీవ్ర గాయాలయ్యాయి. తొలుత స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడిన లక్ష్మీదుర్గ

సత్యదేవుడి సన్నిధిలో ట్రాన్స్‌కో సీఎండీ పూజలు



వేదపండితుల ఆశీర్వచనం పొందుతున్న సీఎండీ పృధ్వితేజ

అన్నవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వితేజ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నేడు ఆలయం మూసివేత

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సత్యదేవుడి ఆలయం మూసివేయనున్నట్టు ఈవో సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల వరకు వ్రతం టిక్కెట్లను విక్రయిస్తామని, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సర్వదర్శనాలు నిలుపుదల చేసి ఆలయ తలుపులు మూసివేయనున్నట్టు ప్రకటించారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ జరిపి 7గంటల నుంచి సర్వదర్శనాలు, వ్రతాలు పునఃప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.కాగా చంద్ర గ్రహణం రాత్రి 9:50గంటలకు ప్రారంభమై 1:31 వరకు ఉంటుందని దేవస్థానం పండితులు తెలిపారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

సత్యదేవుడికి తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ముమ్మారు పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ప్రదక్షిణ నిర్వహించారు. హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.



గోదావరిలోకి దూకిన వృద్ధురాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆమెకు ఏం కష్టం వచ్చిందో తెలియదు కానీ స్థానికులు చూస్తుండగానే పి.గన్నవరం అక్విడెక్టుపై నుంచి గోదావరి నదిలోకి దూకేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం అక్విడెక్టు చెంతనే లంకలగన్నవరం వైపు ఉన్న వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు అక్విడెక్టుపైకి తీసుకువచ్చారు. అప్పటికే అక్కడ తచ్చాడుతున్న ఓ వృద్ధురాలు వారు చూస్తుండగానే అక్విడెక్టు పైనుంచి దూకేసిందని ప్రత్యక్షసాక్షులు చెప్తున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ బి.శివకృష్ణ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని అక్విడెక్టుపై వృద్ధురాలు వదిలేసిన చెప్పులను పరిశీలించి ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అయితే పోలీసులు చెప్పులను స్వాధీనం చేసుకుని అక్విడెక్టుకు ఇరువైపులా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తామని ఎస్‌ఐ తెలిపారు. కాగా వృద్ధురాలి ఆచూకీ కోసం బంధువులు ఎవ్వరూ రాలేదు.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో

15 నుంచి యూటీఎఫ్ రణభేరి

పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అమలాపురం టౌన్/రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ రణభేరి జాతా నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు శనివారం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. పరీక్షల మూల్యాంకనం విద్యాశక్తి ఆన్‌లైన్ అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్టు తదితర బోధనేతర పనులకు సమయం వెచ్చించాల్సి వస్తుందన్నారు. తక్షణం ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని, బకాయిపడ్డ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఈ నెల 15 నుంచి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే రణభేరి జాతాను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సంఘ నాయకులు పెన్నాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లారీ-బైక్ ఢీ.. యువకుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన కోట శ్రీనివాస్

కె.గంగవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని యండగండి వద్ద ఊక లోడు లారీ, మోటార్‌బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. శనివారం పామర్రు నుంచి అంగర వైపు వెళుతున్న ఊకలోడు లారీ, యండగండి నుంచి పామర్రు వైపు వెళుతున్న కోట శ్రీనివాస్ బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న యండగండికి చెందిన శ్రీనివాస్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం నుంచి గణపతి నిమజ్జనంలో హుషారుగా పాల్గొన్న శ్రీనివాసు ప్రమాదంలో మృతి చెందడంతో యండగండిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీ బాషా చెప్పారు.

శంభోజిరావు సేవలు మరువలేనివి



శంభోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గణేష్ మిత్రబృందం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభోజిరావు చేసిన సేవలు మరువలేనివని, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్ అన్నారు. శనివారం బొమ్మూరులో మద్దిపోటి శంభోజిరావు సంతాపసభ జరిగింది. దీనికి గణేష్‌తోపాటు మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, న్యాయవాది గొందేశి శ్రీనివాసరెడ్డి, మత్సేటి ప్రసాద్, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని శంభోజిరావు చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

న్యాయవాదులు నిబద్ధతతో మెలగాలి

ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు నిబద్ధతతో మెలగాలని, తద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించుకోవచ్చని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఆల్ అమీర్ కళాశాలలో యువ న్యాయవాదులకు, న్యాయ విద్యార్థులకు ఏఐబీఈ నమూనా పరీక్షను నిర్వహించారు. ఐఏఎల్ జిల్లా కమిటీ ప్రతినిధి గేదెల మోహన వంశీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముప్పాళ్లతోపాటు సీనియర్ న్యాయవాది సీహెచ్ ప్రభాకరరావు విచ్చేసి పరీక్షలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సభలో ముప్పాళ్ల మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయవాదులు తర్ఫీదు పొందాలన్నారు. కార్యక్రమంలో దాసరి అమ్మిలు, కాశీ శ్రీనివాసరుడు, సత్తి వీర రాఘవరెడ్డి, దర్నాలకోట వెంకటేశ్వరరావు, డీఎస్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అదనపు సుంకాలను రద్దు చేయాలి

వామపక్ష పార్టీల నాయకుల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన అదనపు సుంకాలతో వ్యవసాయం, ఆక్వా, టెక్స్‌టైల్ రంగాలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాయని, తక్షణమే సుంకాలను రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాజమహేంద్రవరంలోని శ్యామలా సెంటర్ వద్ద ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం పార్టీల జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్, న్యూ డెమోక్రసీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద విధానాలు అనేక రంగాల్లో భారత ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని, అయినా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మౌనం వహించడం అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, పవన్, కొండలరావు, లావణ్య పాల్గొన్నారు.

సకల జనుల సౌఖ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం: బాలేపల్లి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశంలో సకల జనుల సౌఖ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధరరావు అన్నారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, బోడా వెంకట్, కొవ్వూరి శ్రీనివాస్‌లతో కలిసి ఆయన మాట్లాడారు.కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ పేరుతో 28శాతం స్లాబ్‌తో సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచిందన్నారు. బీజేపీ చేస్తున్న ఎన్నో అక్రమాలను ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బయట పెట్టారన్నారు. దానిని నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కేంద్రం జీఎస్టీని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. త్వరలో నగర కమిటీలు వేసుకుంటామని స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమౌతుందన్నారు.

యూరియా కొరతంటూ వైసీపీ పసలేని ఆరోపణలు

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత ఉందంటూ వైసీపీ చేస్తున్న పసలేని ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో నియోజకవర్గ వ్యవసాయాధికారులు, సొసైటీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో యూరియా కొరత లేదని, ఇప్పటికే సొసైటీల వద్ద వంద మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉందన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది లేదని, వారికి లేని ఇబ్బంది వైసీపీ నేతలకు ఎందుకో అర్థం కావడం లేదని రామకృష్ణారెడ్డి అన్నారు.

ఆసుపత్రి తనిఖీ.. అనపర్తిలోని ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రూ.13కోట్లలతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణంపై ఆరా తీశారు. వైద్యులు సేవా భావంతో మెలగాలన్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రికి నూతనంగా వచ్చిన వైద్య పరికరాలను సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి ఎమ్మెల్యేకు చూపారు. కార్యక్రమంలో డీసీ డైరెక్టర్లు డీకే దుర్గాప్రసాద్, అన్నవరం, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవల బలోపేతానికి కృషి: ఎమ్మెల్యే వాసు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యసేవల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శనివారం రాత్రి సాంకేతికతతో రూపొందించిన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్)అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అంబులెన్స్‌లో అత్యవసర వైద్యసేవలకు అవసరమైన ఆక్సిజన్ సిలెండర్లు, వెంటిలేటర్లు, ఇంజక్షన్లు, మందులు ఇతర అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయన్నారు. పీపీపీ విధానంలో వైద్య సేవలందిస్తున్నట్టు చెప్పారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల పరిశీలన.. స్థానిక 1,2 డివిజన్లలో ఎమ్మెల్యే వాసు పర్యటించి నారాయణపురం పార్కును, వెంకటరామయ్య నగర్‌లో సిటీ పుష్కర మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 30 పార్కులను సుందరీకరిస్తున్నామన్నారు. కాగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిరంతరం విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

మహేంద్ర ఎలక్ట్రిక్ కార్లలో ప్యాక్-2 వెర్షన్



ప్యాక్-2 వెర్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహేంద్ర ఎలక్ట్రిక్ వాహనాలైన ఎక్స్‌యూవీ9ఈ, బీఈ6 ప్యాక్-2 వెర్షన్‌ను ఆ సంస్థ ప్రతినిధులు మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక మహేంద్ర అండ్ మహేంద్ర లిమిటెడ్ అధీకృత డీలర్ ఎంఅండ్ఎన్ మోటార్స్ షోరూంలో జరిగిన ఒక కార్యక్రమంలో వీటిని లాంచ్ చేశారు. ఆర్మన్ కార్డన్‌తో వచ్చే ఆధునిక ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, భద్రతా ప్రమాణాలలో అడాస్ లెవెల్ -2 ప్లస్ ప్లస్ వీటి ప్రత్యేకత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండీ రాధాకృష్ణ, డైరెక్టర్ శ్రీరాం, జీఎం రాజ, సేల్స్ మేనేజర్లు, పలు ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి: డీఎస్పీ భవ్యకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ అన్నారు. స్థానిక శ్రీవెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో శనివారం రాజమహేంద్రి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆవిర్భావ దినోత్సవం, ఫ్రెషర్స్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమానికి డీఎస్పీతోపాటు నన్నయ వర్శిటీ ఆచార్యులు కె.వెంకటాచార్యులు, కళాశాల ఛైర్మన్ డాక్టర్ కర్రి రామారెడ్డి, కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి, అకడమిక్ డైరెక్టర్ తేతలి సత్యసౌందర్య విచ్చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆత్మరక్షణకు ఏవిధంగా వ్యవహరించాలో వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యప్రదర్శలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్, దేశిరెడ్డి బలరామనాయుడు, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులపై అవగాహన

కడియం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నానో ఎరువుల ద్వారా 20శాతం రసాయనిక ఎరువులు వాడకం తగ్గించవచ్చని వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్ అన్నారు. శనివారం కడియం సొసైటీలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీలను రైతులు పంటలో వాడాలని, అవి వాడితే పొలాలు కోత సమయంలో పడిపోకుండా ధృడంగా ఉండడంతో పాటు పంట నాణ్యత పెరుగుతుందని ఏవో వివరించారు.

బై..బై..గణేశా!

- భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు
- ఆనందోత్సాహాలతో ఘన వీడ్కోలు
- డీజేలు, బాణసంచాతో సంబరాలు
- పలుచోట్ల అన్నసమారాధనలు
- లడ్డూ ప్రసాదం వేలం

బిక్కవోలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలందుకున్న చవితి ఉత్సవాలు ముగియడంతో వినాయకుడు గంగమ్మ ఒడికి చేరాడు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో స్వామి వారిని డీజేలు, బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాల ఊరేగించారు. చిన్నాపెద్దా ఒకరికొకరు రంగులు పూసుకుని ఆనందోత్సాహాలతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలుచోట్ల అన్నసమారాధనలు జరిపారు. స్వామి వారి లడ్డూ ప్రసాదాలకు వేలం నిర్వహించారు. బిక్కవోలు మండలం ఇల్లపల్లి, రంగాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను జోడినాదాల తూము వద్ద బిక్కవోలు కెనాల్‌లో నిమజ్జనం చేశారు. బిక్కవోలులో ఏర్పాటు చేసిన 20 భారీ వినాయక విగ్రహాలను సామర్లకోట కెనాల్‌లో క్రేన్‌ల సాయంతో నిమజ్జనం చేశారు. చిన్నారులు తాము ఏర్పాటు చేసుకున్న చిన్న మట్టి గణపతుల్ని కూడా ఆనందోత్సాహాల నడుమ నిమజ్జనం చేశారు. ఆరికరేవుల, కొంకుదురు, మెళ్లూరు, పందలపాక, కొమరిపాలెం, తొస్సిపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను తుల్యభాగలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో ట్రైనీ ఎస్ఐ ఎ.రవీంద్రబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాగా బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో నిర్వహిస్తున్న చవితి ఉత్సవాలు మహాన్నదానంతో ముగిసాయి. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు సహకారంతో ఏర్పాటు చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు.చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బేరా వేణమ్మ, కమిటీ సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి రాజారెడ్డి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం, గోకవరం, తంటికొండ, గుమ్మళ్లదొడ్డి తదితర గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి.

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు ధవళేశ్వరంలోని రామపాదాల రేవుకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఉత్సవాల నిర్వాహకులు గణనాథుడిని బాజాభజంత్రీలు, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. రామపాదాల ఘాట్ వద్ద ధవళేశ్వరం సీఐ గణేష్, దిశా పోలీస్‌స్టేషన్ సీఐ మంగాదేవి పర్యవేక్షణలో నిమజ్జనోత్సవం సాగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు ఆధ్వర్యంలో రేవు వద్ద పడవలతో గజ ఈతగాళ్లను, పారిశుధ్య సిబ్బందిని మోహరించారు. సీఐ గణేష్, ఎస్ఐ హరిబాబు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

దివాన్‌చెరువు: బీజాపురి టౌన్‌షిప్‌లో జరుగుతున్న శ్రీలక్ష్మీగణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయకుని వద్ద ఏర్పాటు చేసిన ఐదు కిలోల లడ్డూను గుత్తుల సాయివాణి వేలంలో రూ27 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సాయివాణిని బీజాపురి వెల్ఫేర్ అసోసియేషన్ సన్మానించింది. అనంతరం గణపతిని స్థానికంగా ఊరేగించి కలవచర్ల వద్ద కాలువలో నిమజ్జనం చేశారు. ఈ ఉత్సవాలు సందర్భంగా ఇస్కాన్‌కు చెందిన గోపీనాథ్‌దాస్‌ప్రముఖులైన పోలనాటి గోవిందు, కె.విక్రాంత్ ఆధ్యాత్మిక ఉపన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

అనపర్తి: అనపర్తిలోని మార్కండేయపురం స్నేహ గణపతి, కుమ్మరి వీధి గణపతి, బాపనమ్మ ఆలయ వద్ద నెలకొల్పిన గణపతి, సాయి రామ్ మందిర్ గణనాథుడు, శేషగిరిరావు పేట బాలగణపతి విగ్రహాలకు ఘనంగా శోభాయాత్ర నిర్వహించి స్థానిక ధరణికోట రేవులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులతో స్వామి వారికి భక్తులు నీరాజనాలు పలికారు. అనపర్తిలోని సాయిరామ్ మందిర్‌లో గణపతి మండపం వద్ద స్వామి వారి ప్రసాదానికి తీసిన డ్రాలో గ్రామానికి చెందిన పడాల కళ్యాణ్‌రెడ్డి ధనలక్ష్మి దంపతులు లడ్డూను దక్కించుకున్నారు.కొత్తూరులో గణేశుడి శోభా యాత్రలో చిన్నారులు దేవతా మూర్తుల వేషధారణలతో ట్రాక్టర్లపై ఊరేగుతూ భక్తులను అలరించారు. గ్రామంలో ప్రొక్లెయినర్‌పై వినాయకుడికి నిర్వహించిన శోభాయాత్ర భక్తులను ఆకట్టుకుంది. పలు చోట్ల జరిగిన అన్నసమారాధన సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

కోరుకొండ: కోరుకొండ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఏర్పాటు చేసిన సంతాన గణపతిని, జంబుపట్నంలో ఏర్పాటు చేసిన నాట్యగణపతిని, కాపవరం, నర్సాపురం, పశ్చిమగోనగూడెం గ్రామాల్లో గణపతి మండపాలు ఏర్పాటు చేసి గణపతులను మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా అన్న సమారాధనలు నిర్వహించారు. అలాగే గాదరాడ, కణుపూరు, శ్రీరంగపట్నం, బూరుగుపూడి, గాడాల, దోసకాయలపల్లి, మునగాల గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు.



దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు



బిక్కవోలులో గణపతిని ఊరేగిస్తున్న చిన్నారులు



కోరుకొండలో వినాయక ఊరేగింపు దృశ్యం

గణేష్ నిమజ్జనంలో ఘర్షణ

బిక్కవోలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఊలపల్లిలో గణేష్ నిమజ్జనంలో శెట్టిబలిజ, కాపుల వర్గాల మధ్య శనివారం రాత్రి ఘర్షణ నెలకొంది. గ్రామంలోని తుల్యభాగలో ముందుగా తమ విగ్రహం నిమజ్జనం చేయాలంటూ ఒకరికొకరు పోటీ పడ్డారు. దీంతో ఒక వర్గానికి చెందిన వ్యక్తి కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలియడంతో తాము సిబ్బందితో వెళ్లి గాయాల పాలైన వ్యక్తిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్టు సీఐ సుమంత్ తెలిపారు.

నేడు బిక్కవోలులో ఆలయాలు మూసివేత

బిక్కవోలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉదయం పది గంటలకు బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలైన గోలింగేశ్వర, కుమారసుబ్రహ్మణ్యేశ్వర, లక్ష్మీనారాయణస్వామి, శ్రీలక్ష్మీగణపతి ఆలయాలను మూసి వేస్తున్నట్లు ఆలయాల ఈఓ ఆకెళ్ల భాస్కర్ శనివారం తెలిపారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం తిరిగి ఆలయాలను పది గంటలకు తెరుస్తామని, అప్పటి నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు.

ఉమామహేశ్వరికి రాష్ట్ర ఉత్తమోపాధ్యాయ అవార్డు

దివాన్‌చెరువు, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరీదేవి సీఎం చంద్రబాబు, మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. విజయవాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమెను వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి అభినందించారు.

వేగంగా తగ్గుతున్న గోదావరి నీటి మట్టం

ధవళేశ్వరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ ప్రవహిస్తున్న గోదావరి వేగంగా తగ్గుతుంది. ధవళేశ్వరం వద్ద 24గంటల వ్యవధిలో అడుగున్నర మేర నీటి మట్టం తగ్గింది. శనివారం రాత్రి 7గంటల సమయానికి నీటి మట్టం 10 అడుగులకు చేరుకోగా కాటన్ బ్యారేజ్ ద్వారా 7,57,421 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది.

రాజమహేంద్రవరంలో జాతీయ బృందగాన పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్ రోడ్డులోని ఏకేసీ రోటరీ హాల్‌లో రాజమండ్రి భారత్ వికాస్ పరిషత్ శాఖ, టంగుటూరి ప్రకాశం శాఖలు సంయుక్తంగా విద్యార్థులకు శనివారం జాతీయ బృందగాన పోటీలు నిర్వహించారు. విజేతలకు రెండు శాఖల రీజనల్ మేనేజర్లు బహుమతి ప్రదానం చేశారు. జిల్లా సమన్వయకర్త కేవీఎస్ అవధాని వందన సమర్పణ చేశారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవం

కడియం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సుమారు 5,500 శాఖలతో బ్యాంక్ ఆఫ్ ఇండియా 120వ సంవత్సరంలో అడుగుపెట్టిందని బుర్రిలంక శాఖ బ్రాంచి మేనేజర్ శివబాబు తెలిపారు. శనివారం బ్యాంక్ ఆఫ్ ఇండి యా 120వ వ్యవస్థాపక దినోత్సవం బుర్రిలంక బ్రాంచిలో జరిగింది. ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. శివబాబు మాట్లాడుతూ నర్సరీ రైతులకు ఎకరాకు రూ.40 లక్షల వరకు రుణంతో పాటు మహిళా సంఘాలకు, బంగారంపై తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారి సతీష్, గౌరినాయుడు, శ్రీదేవి, జగదీష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్‌కు అభినందన



బుచ్చిరాజును అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

కడియం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, సుందరీకరణ రంగాల్లో విశేష కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బుర్రిలంక గ్రామానికి చెందిన షిర్డిసాయి నర్సరీ గార్డెన్స్ రైతు వడగల వీరవెంకట బుచ్చిరాజుకు శనివారం మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు. జనసైనికులు ఐకమత్యంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి రత్నం అయ్యప్ప, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ బోడపాటి గోపి, పాటంశెట్టి సుబ్బారావు, బాబ్జి, ఆదిమూలం సాయి, సుంకర గోపాలకృష్ణ, కంటంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నరసింహమూర్తి



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి తేజోమూర్తుల నరసింహమూర్తిని ప్రభుత్వం రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. జన సేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేసిన నరసింహమూర్తికి రాష్ట్ర స్థాయి పదవి దక్కడం పట్ల స్థానిక జనశ్రేణులు, రాష్ట్ర బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ తనకు ఈ పదవి అందించినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

జేసీని కలిసిన అడిషనల్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై.మేఘ స్వరూప్‌ను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ శనివారం జేసీ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్సీఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, దారా యేసురత్నం, జి.విజయకుమార్.. జేసీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.





ఈ ఏడాదికి ఉంటా.. వచ్చే ఏడాది కలుద్దాం!

వినాయక..వీడుకోలు!



వస్తా..వెళ్లొస్తా : రాజమహేంద్రవరంలో కుమారి ర్యాంప్ వద్ద విగ్రహాలు.

మా బుజ్జి గణేశుడు : చిన్నారుల తలపై గణపయ్యలు

రాజమహేంద్రవరం గోదావరి గట్టుపై కిక్కిరిసిన జనం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గణేశుడి నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి.. ఆదివారం చంద్రగ్రహణం కావడంతో శనివారమే విగ్రహాలను భారీగా తరలించారు. 11 రోజుల పాటు గణపతిని పూజించి ప్రత్యేక పూజలు చేసిన భక్త జనం గణపతి విగ్రహాలను భారీ ఊరేగింపుల నడుమ గోదావరి, కాలువలకు తరలించి గణపతి విగ్రహాల నిమజ్జనాల ప్రక్రియ నిర్వహించారు. రాజమహేంద్రవరంలో కుమారి ర్యాంప్ వద్దకు చేరుకుని నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రైన్ ద్వారా విగ్రహాలను కిందకు దింపి అటుపై పంటులోకి ఎక్కించి వాటిని గోదావరిలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఉదయం 6 గంటల నుంచే విగ్రహాల నిమజ్జనాలు ప్రారంభించారు. అర్ధరాత్రి సమయం వరకు విగ్రహాలు గోదావరి రేవుకు చేరుకుంటూనే ఉన్నాయి.శనివారం ఒక్కరోజే సుమారు 750 గణపతి విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. ఇంకా నిమజ్జన ప్రక్రియ కొనసాగుతుంది. శనివారం రాత్రి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రేవు వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.



వెళ్లిరావయ్యా : రాజమహేంద్రవరంలో కుమారి ర్యాంప్ వద్ద గణేశుడి విగ్రహాన్ని గోదావరిలో తోస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, తదితరులు

వెళ్లిరా..గణేశా : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఇలా..



కాకినాడ-రాజమహేంద్రవరం గోదావరి కాలువ

గోదారయ్..రయ్!

ఉమ్మడి జిల్లాలో గోదావరి కాలువలపై సరుకు రవాణా

ఒకనాడు రోడ్డు మార్గాలు.. ఆకాశ మార్గాలు ఉండేవి కావు.. కేవలం జల రవాణా లేదంటే నడక.. అందుకే నేటికీ చెబుతుంటారు.. మా తాతలు కాలవల ద్వారా ప్రయాణించే వారని.. అదంతా బ్రిటిష్ వారి కాలంలో మాట.. నేటికీ ఆయా గురుతులు నిడదవోలు, వేమగిరి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి.. మళ్లీ ఆ రోజులు రాబోతున్నాయి.. జల రవాణాను మళ్లీ అందుబాటులోకి తేనున్నారు..ఈ మేరకు గోదావరిలో పది మార్గాలను గుర్తించారు.. ఆయా మార్గాల అభివృద్ధికి టెండర్లు పిలిచారు.. అన్నీ అనుకున్నట్టే జరిగితే గోదారిలో రయ్ రయ్ మంటూ వెళ్లిపోవచ్చు.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గోదావరి అంటే అందాలు.. సరదా షికార్లు.. కానీ ఒకప్పుడు రవాణా రంగం అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో గోదావరిపై అనేక ప్రాంతాలకు బోట్లలో సరుకు రవాణా చేసేవారు. పరిశ్రమలకు అవసరమయ్యే ముడిసరుకులను తరలించేవారు.అనేక పోర్టులకు విదేశాల నుంచి వచ్చే కార్గోను సైతం గోదావరి మీదుగా రవాణా చేసేవారు. బోట్లలో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరేవారు.అయితే మళ్లీ ఇప్పుడు మునుపటి తరహాలో కారు చౌక అయిన జల రవాణా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.గతంలోలా గోదావరి నదిపై బోట్లలో రవాణా జరిగేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం నుంచి విజయవాడ, రాజ మహేంద్రవరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నర్సాపురం,నర్సాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూరు వరకూ ప్రయాణించేలా మొత్తం పది మార్గాలను ఎంపిక చేసింది.ఈ రూట్లలో కాలువల అభివృద్ధి,కార్గో తరలింపు, పర్యాటకుల రవాణా పీపీపీ విధానంలో అభివృద్ధి చేయబోతోంది.

- పది రూట్లలో సరుకు సరఫరా
- వాటర్‌వేస్ అథారిటీ ప్రతిపాదన
- రవాణాకు సానుకూలత
- పర్యాటక బోట్లకు సౌకర్యం
- కాలువల అభివృద్ధికి టెండర్లు
- పీపీపీ విధానంలో పనులు
- మారనున్న గోదారి

ఎన్నిదారులో..

గోదావరిని పర్యాటకంగా,పారిశ్రామికంగా ఉపయోగించేందుకు అడుగులు పడుతున్నాయి. పరిశ్రమలకు ముడిసరుకుల రవాణా నుంచి ఆయా పరిశ్రమల్లో తయారైన ఉత్పత్తుల రవాణా వరకు గోదావరి నది ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకు నేషనల్ వాటర్ వే-4ను అభివృద్ధి చేసి పూర్వ వైభవం తెచ్చేలా సన్నాహాలు చేస్తోంది. కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు ఉన్న ఈ జల రహదారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాలను కలుపుతూ 1,095 కిలోమీటర్లు పయనిస్తోంది. ఈ జల రహదారిలో అత్యంత కీలకమైన కాకినాడ, రాజమహేంద్రవరం,విజయవాడ, భద్రాచలం రూట్లను కొత్తగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ తాజాగా నిర్ణయించింది. ప్రధానంగా గోదావరి నది ద్వారా కాకినాడ, రాజమహేంద్రవరం, విజ యవాడ, భద్రాచలం,అంతర్వేది రూట్లలో కార్గో, పర్యాటక రవాణాకు ఎంతో డిమాండ్ ఉందని భావిస్తోంది.ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరిపై మొత్తం పది రూట్లను ఎంపిక చేసింది. ఈ మార్గాల్లో కాలువలను అభివృద్ధి చేసి సరుకు రవాణా, పర్యాటక రవాణా అభివృద్ధి చేయాలని ప్రతి పాదించింది.ఈ రూట్లలో ఒకప్పుడు సరుకు రవాణా ఎక్కువగా జరిగేది. కాకినాడ నుంచి బకింగ్‌హం కాలువ వరకు ఎన్నో ఏళ్ల కిందట అనేక పరిశ్రమలకు ఈ కాలువ ద్వారా కార్గో రవాణా అయ్యేది.ఈ నేపథ్యంలో మళ్లీ గోదావరిపై రవాణాకు ద్వారాలు తెరవబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ఎలా ఉపయోగిస్తారంటే..

కాకినాడ పోర్టుకు తెలంగాణ, తమిళనాడు నుంచి వేలాది లారీల్లో భారీ ఎత్తున బియ్యం విదేశాలకు ఎగుమతి కోసం వస్తోంది. భవిష్యత్తులో గోదావరిపై బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించేందుకు అడుగులు పడుతున్నా యి. తెలంగాణ నుంచి పోర్టుకు చైనాకు ఎగుమతి చేయడం కోసం భారీ బండరాళ్లను విజయవాడ-విశాఖ హైవే ద్వారా తరలిస్తు న్నారు. భవిష్యత్తులో ఈ రాళ్లను గోదావరి ద్వారా రవాణా చేయడానికి అనువుగా ఉంటుందని, ఖర్చు కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. వివిధ దేశాల నుంచి కాకినాడ పోర్టుకు బొగ్గు, ఎరువులు దిగుమతవుతున్నాయి. వీటిని తెలంగాణతో పాటు విజయవాడ సమీపంలోని అనేక థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు గోదావరిపై బొగ్గు రవాణా చేయనున్నారు. భద్రాచలం, రాజమ హేంద్రవరంలో కాగితం పరిశ్రమలకు పల్ప్‌ను రవాణా చేయడానికి డిమాండ్ ఉందని గుర్తించారు. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు కాలువ ద్వారా విజయవాడకు అనేక రకాల సరుకుల కారుచౌక ధరకు రవాణా చేసేందుకు అవకాశాలు చాలా ఉన్నట్టు గుర్తించారు. కాకినాడ పోర్టుకు క్లింకర్, రాక్‌పాస్ఫేట్ వంటి అనేక రకాల కార్గో వివిధ పరిశ్రమలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. వీటన్నింటినీ గోదావరిపై కార్గో రవాణా ద్వారా భారీ ఎత్తున చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వరకు కేవలం పర్యాటకుల కోసం ప్రస్తుతం బోట్లు నడుపుతున్నారు.ఈ రూట్‌లో భవిష్యత్తులో తెలంగాణకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకులను పెద్దఎత్తున తరలించేలా జలరవాణాను ప్రోత్సహించనున్నారు. నర్సాపురం-అంతర్వేది, ముక్తేశ్వరం -కోటిపల్లి రూట్లలో ప్రస్తుతం పంట్లలో రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్తులో ఈ రూట్లను ఆధునికీకరించి పెద్ద ఎత్తున వస్తు రవాణా,పర్యాటకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేలా జల రవాణా ప్రోత్సహించనున్నారు. దీంతో మళ్లీ పూర్వపు రోజులు రానున్నాయి.

గోదారి వయా..

కాకినాడ నుంచి రాజమహేంద్రవరం కాలువ, రాజ మహేంద్రవరం నుంచి విజయవాడకు ఏలూరు కెనాల్, రాజమ హేంద్రవరం నుంచి గండి పోచమ్మ, గండిపోచమ్మ నుంచి భద్రాచలం, పురుషోత్తపట్నం నుంచి భద్రాచలం, పురు షోత్తపట్నం నుంచి పోలవరం, పట్టిసీమ హిల్‌లాక్ టెంపుల్ నుంచి పట్టిసీమ మెయిన్ లాండ్, అంతర్వేది పల్లిపాలెం నుంచి నర్సాపుర్ వెస్ట్, నర్సాపురం నుంచి సఖి నేటిపల్లి, రాజోలు మండలం సోంపల్లి నుంచి అబ్బిరాజుపాలెం, కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం వరకు మొత్తం పది రూట్ల లో గోదావరిలో కార్గో రవాణాకు వీలుగా రహదారులను అభివృద్ధి చేయబోతున్నారు. ఈ మేరకు వాటర్‌వేస్ అథారిటీ ఇటీవల టెండర్లు పిలిచింది. ఈ పది రూట్లను స్ట్రాటజిక్ మార్గాలుగా అభివృద్ధి చేసి పరిశ్రమల క్లస్టర్లు, మల్టీమోడల్ కనెక్టివిటీ పాయింట్స్‌ను గుర్తించాలని పలు కంపెనీలను ఆహ్వానించింది. గోదావరిపై గుర్తిం చిన పది రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఒకప్పుడు కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు ఉన్న కాలువ ద్వారా ఏటా 11 మిలియన్ టన్నుల కార్గో రవాణాకు అవకాశం ఉందని కొంతకాలం కిందట వాప్కోస్ అనే సంస్థ అధ్యయనంలో తేల్చింది. ఇందులో 30శాతం కార్గో రవాణా కాకినాడ- రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం- భద్రాచలం, రాజమహేంద్రవరం-విజయవాడ జలమార్గాల్లో జరిగే అవకాశం ఉందని విశ్లేషించింది.



పిఠాపురం మునిసిపాలిటీ, తాళ్లపూడిలో నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

వలంటీర్లలా చేయలేం!

సచివాలయ ఉద్యోగుల ఆందోళన బాట

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన
- రిజిస్ట్రేషన్ విధులు బహిష్కరణ

పిఠాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. మునిసిపల్, నగరపంచాయతీ, మండలపరిషత్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను సామూహికంగా బహిష్కరించారు.ఆత్మగౌరవం కోసమే తాము ఆందోళన బాట పట్టామని వారు స్పష్టం చేశారు. ఒక క్లస్టర్‌లో వలంటీర్ విధులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం నుంచి ఆందోళన చేపట్టారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై విధులు నిర్వహించారని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు అప్పగిస్తూ మ్యాప్ చేయడంతో పాటు బలవంతంగా ఇంటింటికి తిరిగి విధులు నిర్వర్తించే బాధ్యతలు అప్పగిస్తున్నారని తెలిపారు. ఇదే రీతిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటా తిరిగి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఇంటికి సర్వీస్ నమోదు చేయించాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అధికారులు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు గూగుల్‌మీట్ ద్వారా సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను బహిష్కరించాలని, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా పిఠాపురం మునిసిపల్ కార్యాలయంతో పాటు కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, తుని పురపాలక సంఘాలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగరపంచాయతీలు, కాకినాడ కార్పొరేషన్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి వార్డు సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎక్కడిక్కడ ఆందోళనలు నిర్వహించారు. గ్రామ, సచివాలయ ఉద్యోగుల మనోవేదన ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే నిరసన తెలియజేస్తున్నామని సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు.

జిల్లాకు రెండు పోలీస్ జాగిలాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాకు రెండు పోలీసు జాగిలాలు చేరుకున్నాయి. వాటి శిక్షణను ఎస్పీ నరసింహ కిషోర్ పరిశీలించి,సిబ్బందికి పలు సూచనలు చేశారు.కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ జాగిలాల పేర్లు క్లైరా, రాడో అని చెప్పారు. రాడో నేరస్తులను పట్టుకోవడం, నార్కోటిక్ పదార్థాలు గుర్తించడంలో ప్రతిభ కనబరుస్తుందన్నారు. ఇది శిక్షణ కాలంలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించిం దన్నారు. క్లైరా పేలుడు పదార్థాలు గుర్తిం చడంలో ప్రతిభ సాధించిందన్నారు.



క్రేన్‌లు, మోటార్ల మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

బ్యారేజ్‌పై 78 గేట్లకు అత్యవసర మరమ్మతులు

మద్దూరు, విజ్జేశ్వరం ఆరమ్‌లలో పనులు ప్రారంభించిన ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నీటి పారుదల పథకాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం సీతంపేట వద్ద ధవళేశ్వరం బ్యారేజ్‌పై మద్దూరు, విజ్జేశ్వరం ఆరమ్‌లలోని 78 గేట్లకు సంబంధించి క్రేన్లు, మోటార్ల అత్యవసర మరమ్మతు పనులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. 1976లో ప్రారంభించిన మద్దూరు, విజ్జేశ్వరం ఆరమ్‌లలో క్రేన్‌లు, మోటార్లు మరమ్మతులకు గురికావడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.దీనిపై స్పందించిన జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తక్షణం రూ.18 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు పనులు ప్రారంభించినట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు నియోజకవర్గంలోని మలకపల్లి వచ్చినప్పుడు ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు గురయ్యాయని సుమారు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, బేతిన నారాయణ, కంటిపూడి శ్రీనివాస్, మరపట్ల కళాధర్, సుంకర సత్తిబాబు, సర్పంచ్‌లు జెట్టి బంగారయ్య, మేరకల శ్రీను, డీఈ ఆనంద బాబు, ఆర్‌పీవో సెక్షన్ ఏఈ ఆర్.సునీల్‌బాబు, అక్కిన రాంబాబు పాల్గొన్నారు.

యూరియా కొరత అవాస్తవం

- అందుబాటులో 1667 మెట్రిక్ టన్నులు : కలెక్టర్
- ఇప్పటి వరకూ 21 వేల మెట్రిక్ టన్నులు సరఫరా
- నానో యూరియా లాభదాయకం : జేడీఏ

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం ఆందోళన చెందనవసరం లేదని.. ప్రస్తుతం జిల్లాలో 1667 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ ప్రశాంతి శనివారం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎరువులకు అంతరాయం లేకుండా సరఫరా కొనసాగుతుందన్నారు. గతేడాది 2024 సెప్టెంబరు చివరి నాటికి 19 వేల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరగ్గా ఈ ఏడాది 2025 సెప్టెంబరు 5వ తేదీ నాటికి 21 వేల మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ అక్టోబరు చివరి వరకు జిల్లా అవసరం దాదాపు 26,473 మెట్రిక్ టన్నులు ఉంటుందన్నారు. అంటే ఇంకా 5,525 మెట్రిక్ టన్నులు వినియోగానికి అవసరమని..స్టాక్ అందుబాటులో ఉంచుతున్నట్టు పేర్కొన్నారు. యూరియా కొరత ఉందని కొంతమంది చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువుల సరఫరాకు జిల్లా యంత్రాగం పూర్తిగా సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలోని 94 సొసైటీల్లో 2025 సెప్టెంబరు వరకు 13,689 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయన్నారు. గత ఖరీఫ్ సీజన్ కంటే 2,602 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా అమ్మకాలు జరిగాయన్నారు.

అవసరానికి మించి యూరియా వాడొద్దు

అవసరానికి మించి యూరియా వాడకం వల్ల నేల దాని సహజ స్వభావం కోల్పోతుందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. రూరల్ మండలం తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నానో ఎరువుల వినియోగంపై ప్రచారం నిర్వహించారు. నానో యూరియా 500 ఎంఎల్ బాటిల్ 45 కేజీల యూరియా బస్తాను భర్తీ చేస్తుందన్నారు. సంప్రదాయ ఎరువుల 2-3 దఫాలు వేయడం వల్ల అనేక రకాలు అనగా నీరు, గాలిలో కలిసి కొంత వరకు మాత్రమే పంటకు లభ్యమవుతుందన్నారు. నానో యూరియా వాడకం సులభం మరియు పంటపై స్ప్రే చేయడం వల్ల పైరు త్వరగా గ్రహించి పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు డీఎస్ రెడ్డి, భీమరాజు, పీటర్, సొసైటీ సీఈవో సత్యనారాయణ, సంఘం చైర్మన్ దండమూడి బాపినీడు, సభ్యులు నల్లూరి రామకృష్ణ, విన్నకోట శేషాచార్యులు రైతులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

ప్రైవేటు అంబులెన్స్‌ల దందాపై విచారణ

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో ప్రైవేటు అంబులెన్స్‌లు, ఆటోల దోపిడీ దందాపై విచారణ మొదలైంది. ఈ నెల 4న 'శవాలతో బేరం' శీర్షికన పేదలను పిండేస్తున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలి సిందే.దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రశాంతి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్, ప్రభు త్వాస్పత్రి ప్రత్యేక అధికారి భాస్కర్‌రెడ్డిని ఆదేశించారు.5న సెలవు కావడంతో శనివారం(6న) భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని సూపరింటెండెంట్ సౌభాగ్యలక్ష్మి సమక్షంలో ప్రైవేటు అంబులెన్స్‌ల డ్రైవర్లను విచారించారు. తాము పేదలకు సేవ చేస్తున్నామని..50 కిలోమీటర్లకు కేవలం రూ.800 మాత్రమే తీసుకుంటున్నామంటూ వారు డిప్యూటీ కలెక్టర్‌కి అవాస్తవాలు చెప్పినట్టు సమాచారం. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కి ఫోన్ చేస్తా నంటూ ఓ వ్యక్తి డిప్యూటీ కలెక్టర్‌ని సైతం బెదిరించినట్టు తెలుస్తోంది.నివేదికను కలెక్టర్‌కి సమర్పించిన అనంతరం చర్యలు తీసుకోనున్నారు.ఈ విషయంలో అంబులెన్స్‌లు,ఆటోలను వెనకేసుకొచ్చి అధికారులపై 'పెద్దలు' ఒత్తిడికి దిగకపోతే పేదలకు న్యాయం జరిగే అవకాశం ఉందని వాదన వినవస్తోంది.

9న మెరిట్ స్టాఫ్‌నర్సుల సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ వైద్య, ఆరోగ్యసంచాలకుల కార్యాలయంలో జోన్-2 పరిధిలో స్టాఫ్‌నర్సు పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఈ నెల 9వ తేదీన జరుగుతుందని సంచాలకులు పి.పద్మా శశిధర్ పేర్కొన్నారు.ఈ ఏడాది జనవరి 2 నుంచి 17వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించామన్నారు. పరిశీలన అనంతరం తుది మెరిట్ లిస్టులను జూలై 7న విడుదల చేశామన్నారు. మెరిట్ జాబితాలోని అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి అదే రోజున కౌన్సెలింగ్ జరిపి ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన జరుగుతుందన్నారు.

తాళ్లపూడిలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

తాళ్లపూడి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్సీ కమిషన్ కుట్ర, వివక్షతకు గురైన బాధితులకు న్యాయం చేసేందుకే ఉందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. శనివారం ఆయన తాళ్లపూడి వచ్చిన సందర్భంగా సర్పంచ్ నక్కా అనురాధ చిట్టిబాబు గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఆత్కూరి రాంబాబు, బోడపాటి కాశీ, నామా సురేంద్ర, తదితరులు ఉన్నారు.

'అభివృద్ధిని వివరించండి'

నిడదవోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇటీవల పలు కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమితులైన వారంతా మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బోర్డు డైరెక్టర్లు మంత్రిను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాటక అకాడమి డైరెక్టర్ వెలగన దుర్గా అనంతలక్ష్మి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ముంతాజ్‌బేగం, అగ్రికల్చరల్ మిషన్ డైరెక్టర్ కోరశిఖ చంద్రమౌళి, పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

కొవ్వూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జనసేన నాయకుడు గాదె వెంకటేశ్వరరావు నోరు అదుపులో పెట్టుకోవాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా రవిప్రకాష్ హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అభిమానాన్ని చాటుకోవాలి అంతే కానీ, అన్యాయానికి గురైన ప్రీతి కుటుంబాన్ని బెదిరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తామని చెప్పిన పార్టీ నాయకులు ఇలా బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. అలాగే వెంకటేశ్వరరావుపై అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. 10వ తరగతి చదివే బాలిక వసతిగృహంలో చనిపోయిందని, పోస్టుమార్టంలో అత్యాచారం జరపబడి హత్యగా చెప్పినా... విచారణలో సాక్ష్యాలను మాయం చేశారని విమర్శించారు. తక్షణమే ముద్దాయిలను గుర్తించి కఠినంగా శిక్షించాలని రవిప్రకాష్ డిమాండ్ చేశారు.

క్యాన్సర్ బాధితులకు 'ఆశ్రయ' ఉచిత సేవలు

కొవ్వూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు చివరి దశలో ఆశ్రయ ఫౌండేషన్ ఉచితంగా సేవలు అందజేస్తుందని సంస్థ నిర్వాహకులు మదిర పల్లవి, విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని నందమూరు రోడ్‌లో నూతన నిర్మించిన ఆశ్రయ ఫౌండేషన్ భవనాలను హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్ రాంప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్లు పాటిబండ్ల సాంబశివరావు, అన్నె రత్నప్రభాకర్, పాస్ట్ ప్రెసిడెంట్ వీవీకే రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు పాంగలూరు కల్యాణ్, పట్టణ సీఐ పీ.విశ్వం, పరిమి హరిచరణ్, ఉప్పులూరి రామకృష్ణ, కంటమణి రామకిషోర్, నామాన బుల్లిరాజు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో సమావేశం

తాళ్లపూడి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ లక్ష్మీలావణ్య తెలిపారు. ఈ మేరకు శనివారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. మండలానికి మొత్తం 16,674 స్మార్ట్ కార్డులు మంజూరు కాగా, ఇప్పటి వరకు 11,671 కార్డులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విధులకు

తాళ్లపూడి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక సచివాలయ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ నిత్యం తాము చేసే విధులకు తోడు ప్రభుత్వం నిర్వహించే అనేక సర్వేల బాధ్యతలు కూడా అప్పగించడంతో భారంగా మారిందని తెలిపారు. తాజాగా రియల్ గవర్నెన్స్ పేరుతో 750 రకాల సేవలు ప్రజలు వినియోగించుకునే విధంగా ప్రతి వ్యక్తిని కలవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటింటికీ తిరిగి చేసిన సర్వేలు కూడా తమనే చేయాలని ఆదేశించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఇరుక్కుపోయిన లారీ

• నిలిచిపోయిన వాహనాలు
• అధికారుల పర్యవేక్షణ లోపం



తాళ్లపాలెం అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద ఇరుక్కుపోయిన లారీ

నిడదవోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆర్వోబీ పనులు జరుగుతుండడంతో కొంతకాలంగా ఆ ప్రాంతం నుంచి నిడదవోలు-తాడేపల్లిగూడెం వాహనాల రాకపోకలు నియంత్రించారు. శింగవరం తాళ్ల పాలెం మీదుగా ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద నుంచి చిన్న కార్లు, మోటారు సైకిళ్లకు మాత్రమే రాకపోకలకు అనుమతి ఉంది. కాగా, అధికారుల పర్యవేక్షణ లోపంతో శనివారం ఓ క్వారీ లారీ వెళుతూ బ్రిడ్జి కింద ఇరుక్కుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇలా అనధికారికంగా తిరుగుతున్న వాహనాలపై పోలీస్, రెవెన్యూ, రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జైజై..గణేశా!

• నిమజ్జనాలకు తరలిన గణనాథులు
• యువత కేరింత, డప్పు వాయిద్యాలతో ఊరేగింపులు
• పోలీసు బందోబస్తు ఏర్పాటు



నిడదవోలులో భారీ వినాయకుడి నిమజ్జన ఊరేగింపును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఎలాంటి విఘ్నాలు లేకుండా ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఆది దేవుడైన వినాయకుడిని ప్రార్థించానని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని గణేష్ చౌక్ సెంటరు, 24వ వార్డుల్లో నెలకొల్పిన మండపాల సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా గణేష్‌చౌక్ సెంటరులోని పూజా గణపతి కుమారస్వామి వార్ల ఆలయంలో మహాగణపతి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఎంతో క్రమశిక్షణగా ఆలయ కమిటీ గత 103 సంవత్సరాలుగా గణపతి నవరాత్రులు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కారింకి సాయిబాబు పాల్గొన్నారు.

కొవ్వూరు: గత 11 రోజులుగా నిత్య పూజలందుకున్న వినాయక విగ్రహాలను శనివారం డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. దీనిలో భాగంగా అన్నసమారాధనలు, లడ్డూల వేలం పాటలు నిర్వహించారు. కొవ్వూరు సుబ్రహ్మణ్య స్నానఘట్టంలో లడ్డూకు వేలం పాట నిర్వహించగా, పారా మహంకాళి రూ. 75 వేలకు దక్కించుకున్నాడు. విగ్రహాలన్నీ గోష్పాదక్షేత్రానికి చేరుకున్నాయి. పోలీసుల సహకారంతో ఏర్పాటుచేసిన క్రేన్లతో గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ జీ.దేవకుమార్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పీ.విశ్వం, ఎస్ఐ విజయ్‌కుమార్ బందోబస్తును ఏర్పాటుచేశారు.

పెరవలి: కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి, నల్లాకులవారిపాలెం కొత్తపల్లి, అజ్జరం, తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనాలకు తరలించారు. దీనికి గాను ముందుగా వాహనాలను అందంగా అలంకరించారు.తీపర్రు వడ్డిల వీధిలోని వినాయకుడని అశ్వవాహనంపై ఊరేగించడం పలువురిని ఆకట్టుకుంది.

తాళ్లపూడి: మండలంలోని పలు గణపతి మండపాల్లో పూజలు అందుకున్న గణపతులకు శనివారం నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. తాళ్లపూడి కాపులపేటలో నెలకొల్పిన వరసిద్ధి వినాయకుడ్ని యువజన సంఘం ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం గ్రామంలోని మెరక వీధిలోని ఆలయం వద్ద నెలకొల్పిన వినాయకుడ్ని నిమజ్జనం చేశారు. ఇక్కడ లడ్డూని వేలంపాట వేయగా ఆకుల నాని రూ. లక్షా 11 వేలకు పాడుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, బీజేపీ నాయకుడు కైరం అప్పారావు, సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు, సొసైటీ మాజీ చైర్మన్ కవల శ్రీనివాస్, దుగ్గిన సూర్యచంద్రం, జనసేన నాయకులు పసుపులేటి శివనాగప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వేలివెన్నులో లక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది కల్కి అవతారంలో గణనాథుడు దర్శనమిచ్చారు. గరగ నృత్యాలు, కేరళ డప్పులతో గ్రామోత్సవం కన్నులపండుగా జరిగింది. నిడదవోలు సీఐ, ఉండ్రాజవరం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. యువత, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం శ్రద్ధ

• ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య

కొవ్వూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని ఆంధ్రా సుగర్స్ జేఎండీ, నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. శనివారం దొమ్మేరులో ఆరుగురికి మంజూరైన రూ. 2,72,963 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ గారపాటి శ్రీదేవి, వాడవెల్లి రామచంద్రరావు, కేవీకే రంగారావు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న అచ్యుతరామయ్య (అచ్చిబాబు)

విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాలంగిలో విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార సభ శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ బొక్కా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘానికి ప్రభుత్వం ద్వారా నిధులు సమకూరితే గ్రామపంచాయతీ తీర్మానం చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూతన అధ్యక్షుడిగా మంకు దుర్గారావు, ఉపాధ్యక్షుడిగా సున్నం దుర్గారావు, కార్యదర్శిగా గన్నవరపు వీరాచార్యులు, సంయుక్త కార్యదర్శిగా వసంతవాడ ఫణికుమార్, కోశాధికారిగా మేడూరి మధుశేఖర్, ఉప కోశాధికారిగా సున్నం జగదీష్, ప్రధాన సలహాదారుడిగా మేడూరి జానకిరామయ్య, ఉప సలహాదారుడిగా కోరుమిల్లి శ్రీరామారావుతోపాటు 13 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఈడ్పు గంటి ఉదయకుమార్, ఐరగవరం ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు, సంఘ నాయకుడు మందరపు మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఆవపాడులో పిచ్చి కుక్కకాటు బాధితులకు వైద్యం

• స్పందించిన డీఎంహెచ్‌వో వెంకట్రావు • ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బాధితులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

నల్లజర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆవపాడులో పిచ్చికుక్క కాటుకు గురైన బాధితులకు నల్లజర్ల వైద్యబృందం శనివారం వైద్యసేవలు అందించింది. పిచ్చికుక్క స్వైరవిహారం ... 15 మందిపై దాడి ... అనేక శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యబృందం స్పందించింది. డీఎంహెచ్‌వో కే.వెంకట్రావు సంఘటనకు సంబంధించిన వివరాలను డాక్టర్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వివరిస్తూ బాధితులకు శుక్రవారమే ప్రథమ చికిత్స అందించిన అనంతరం రేబీస్ ఇమ్యునో గ్లోబ్యులిన్ ఇంజక్షన్ కోసం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించామని చెప్పారు. బాధితులను పరామర్శించిన వారిలో టీడీపీ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు షేక్‌మీరా సాహెబ్, మండల అధ్యక్షుడు ఆచ్యుత వెంకట్రావు, నాయకులు జోగినీడి వెంకట్రావు, ఎర్ర పెద్దబాబు, చామన అబ్బులు, తదితరులు ఉన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి : ఎమ్మెల్యే

చాగల్లు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నెలటూరులోని ఎన్టీఆర్ శ్రీసీతారామ కల్యాణ మండపంలో ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) కొవ్వూరు జోన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వశక్తితో ఎదగాలన్నారు. అనంతరం తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావు, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, అపుస్మా రాష్ట్ర కార్యదర్శి జంగా బాలాజీ, అపుస్మా రీజనల్, జోనల్ అధ్యక్షుడు బుల్లబ్బాయి చౌదరి, చాగల్లు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల విద్యాశాఖ అధికారులు, జోన్ విద్యా సంస్థల కరస్పాండెంట్‌లు, ప్రతి పాఠశాల నుండి ఒక ఉపాధ్యాయుడుకి ముఖ్య అతిథుల చేతుల మీదుగా సన్మానం చేసి గురుబ్రహ్మ అవార్డులు అందించడం జరిగింది. జోన్‌లోని అన్ని విద్యా సంస్థల నుంచి సుమారు 400 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. జోన్ ప్రెసిడెంట్ అవినాష్, సెక్రటరీ పి. వెంకట రత్నం, కోశాధికారి తిమోతి, జోన్ పెద్దలు వల్లిపల్లి వెంకట రామారావు, మల్లిన ప్రవీణ్, తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



నెలటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

'50 శాతం సుంకాలను ఎత్తివేయాలి'

కొవ్వూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశంపై అమెరికా విధించిన 50 శాతం సుంకాలను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపుమేరకు కొవ్వూరు పట్టణంలో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వం విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటిని పార్లమెంటులో నిరసిస్తూ తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నం, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఈమని మల్లిక, ఐఎఫ్‌టీయూ నేతలు బాబీ, రామకృష్ణ, రాము, భూషణం, నాగేశ్వరరావు, రాజేశేఖర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

గోపాలపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాదాలకుంటకి చెందిన నామాల నిర్మల గత ఏడాది ఏప్రిల్ 18న వంట చేస్తుండగా గ్యాస్ లీకవడంతో పెనుప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఆమెతో పాటు కుమార్తె కల్యాణి, కుమారుడు కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా నిర్మల మృతిచెందింది. దీంతో హెచ్‌పీ గ్యాస్ యాజమాన్యం ప్రమాద బీమా పథకం వర్తిస్తుందని తెలియజేశారు. ఈ మేరకు వచ్చిన రూ.7 లక్షల 32 వేలు నగదు చెక్కును శనివారం మృతిరాలి భర్త శ్రీను, కుమార్తె కల్యాణికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హెచ్‌పీ గ్యాస్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరావు, దేవరపల్లి శ్రీపద్మసాయి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి ముళ్లపూడి గంగాధర్ అందించారు. ప్రమాద సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు గ్యాస్ లీకై ప్రమాదానికి గురైన నామాల నిర్మల కుటుంబాన్ని ఎన్నికల సమయంలో పరామర్శించి ... బాధిత కుటుంబానికి తనవంతు సాయంగా రూ. 50 వేల నగదు అందించిన విషయం తెలిసిందే.



మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న దృశ్యం

కన్నులపండువగా వెంకన్న కల్యాణోత్సవం

దేవరపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం యర్నగూడెం మహిళా మండలివారిచే కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అలాగే సాయంత్రం మూడుగంటల నుంచి రాత్రి తొమ్మిది వరకు కల్యాణ మహోత్సవ గానామృతాన్ని నిర్వహించారు. దీన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణ కార్యక్రమాన్ని యాగంటి శ్రీనివాస్, లక్ష్మీపద్మావతి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలు తీసుకొస్తున్న యాగంటి శ్రీనివాస్ దంపతులు

శంభోజీరావు సేవలు మరువలేనివి

• సంతాప సభలో వైసీపీ నేత జక్కంపూడి గణేష్



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బొమ్మూరు గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభోజీరావు చేసిన సేవలు మరువలేనివని వైసీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్ అన్నారు. శనివారం బొమ్మూరులో శంభోజీరావు సంతాప సభను నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆయన చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమానికి మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంభోజీరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తూ ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

శంభోజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జక్కంపూడి గణేష్ మిత్రబృందం